# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-02-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **2025-26 ఆర్థిక సంవత్సరానికి 3.22 లక్షల కోట్ల రూపాయలతో పూర్తిస్థాయి బడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఈరోజు శాసన సభలో ప్రవేశ పెట్టారు.**
2. **దేశ, రాష్ట్రాల ఆర్థికాభివృద్ధికి దోహదపడేది వ్యవసాయ రంగం అని మంత్రి కె.అచ్చెన్నాయుడు ఉద్ఘాటించారు.**
3. **రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు చిత్తూరుజిల్లాలో పర్యటించి పింఛన్ల పంపిణి కార్యక్రమంలో పాల్గొంటారు.**
4. **రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించడం ద్వారా డిస్కంలపై రుణ భారాన్ని తగ్గిస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.**
5. **రాష్ట్రంలో రేపటి నుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.**

===========================

అమరావతిలో రాష్ట్ర శాసన సభ బడ్జెట్ సమావేశాలు ఈ ఉదయం తిరిగి ప్రారంభమయ్యాయి. సమావేశాలు ప్రారంభం కాగానే ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను శాసన సభలో ప్రవేశపెట్టారు. 3.22 లక్షల కోట్ల రూపాయలతో కూడిన వార్షిక బడ్జెట్‌ను ఆయన సభ ముందు ఉంచారు. ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తూ బడ్జెట్ రూపొందించామని అన్నారు. బడ్జెట్లో రెవెన్యూ వ్యయం అంచనా 2 లక్షల 51 వేల 162 కోట్ల రూపాయలు కాగా, మూలధన వ్యయం అంచనా 40 వేల 635 కోట్ల రూపాయలుగా ఉంటుందని తెలిపారు.కాగా రెవెన్యూ లోటు 33 వేల 185 కోట్ల రూపాయలు ఉండగా, ద్రవ్య లోటు 79 వేల 926 కోట్లు రూపాయలని మంత్రి వెల్లడించారు.బడ్జెట్లో వివిధ రంగాలకు చేసిన కేటాయింపులను మంత్రి వివరిస్తూ...

..వాయిస్... 35 సెకన్లు

అంతకుముందు అసెంబ్లీలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై 2025-26 వార్షిక బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ పత్రాలను అందజేశారు.

-------------------------

మరోవైపు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శాసన సభలో ఈరోజు 2025- 26 సంవత్సర వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మొత్తం బడ్జెట్ వ్యయం 48 వేల 340 కోట్ల రూపాయలుగా పేర్కొన్నారు. దేశ, రాష్ట్రాల ఆర్థికాభివృద్ధికి దోహదపడేది వ్యవసాయ రంగం అని బడ్జెట్‌ని ప్రవేశ పెడుతూ అచ్చెన్నాయుడు ఉద్ఘాటించారు. ప్రధాన వనరైన వ్యవసాయాన్ని ప్రాథమిక రంగంగా గుర్తించామన్నారు. రైతులకు ఆర్థిక చేయూతనిస్తూ స్వర్ణాంధ్ర-2047 లక్ష్యానికి ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. రైతులకు వడ్డీలేని రుణాలకు 250 కోట్ల రూపాయలు, అన్నదాత సుఖీభవ అమలుకు 9 వేల 400 కోట్ల రూపాయలను కేటాయించామని మంత్రి పేర్కొంటూ

...వాయిస్.. 41 సెకన్లు

అలాగే శాసన మండలిలో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టగా .. వ్యవసాయ బడ్జెట్ ను మంత్రి పొంగూరు నారాయణ ప్రవేశ పెట్టారు.

-------------------------

రాష్ట్రంలో 2029 జాతీయ క్రీడల నిర్వహణకు సహకరించాలని భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కోరారు. గుంటూరు జిల్లా ఉండవల్లి నివాసంలో ముఖ్యమంత్రిని పీటీ ఉష నిన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ నూతన క్రీడా విధానం గురించి ముఖ్యమంత్రి చర్చించారు. ప్రతిభావంతులైన యువ అథ్లెట్లకు ఉత్తమ అవకాశాలు కల్పించడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. రాష్ట్రానికి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు సహకరించాలని పీటీ ఉషను కోరారు. అమరావతిలో నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుతో పాటు క్రీడా నగరం అభివృద్ధిపైనా పీటీ ఉషతో చర్చించామని చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు.

-------------------------

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు చిత్తూరుజిల్లా గంగాధర నెల్లూరు మండలంలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా ఎన్టీఆర్ భరోసా కింద లబ్ది దారులకు పింఛన్లను పంపిణీ చేయనున్నారు. ఇది ఇలావుండగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద ప్రతి నెలా ఒకటవ తేదీన జరుగుతున్న సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం స్వల్ప వెసులుబాటు కల్పించిందని సంబంధిత అధికారులు తెలిపారు. పింఛన్ల పంపిణీ ఉదయం 7 గంటలకు ప్రారంభించానున్నామని, ఈమేరకు ఆ సమయానికి మాత్రమే యాప్ పనిచేసేలా ప్రభుత్వం మార్పులు చేసిందని పేర్కొన్నారు. కాగా లబ్ధిదారుల ఇళ్ల వద్ద నుంచి 300 మీటర్ల కంటే ఎక్కువ దూరంలో పంపిణీ చేస్తుంటే ఏ కారణంతో అలా చేయాల్సి వచ్చిందో వెంటనే నమోదు చేసేలా ఆ యాప్‌లో మార్పులు చేశారని తెలిపారు. గ్రామ,వార్డు సచివాలయాల ఉద్యోగులు, లబ్ధిదారుల విజ్ఞప్తి మేరకు ఈ మార్పులు చేసినట్లు పేర్కొన్నారు.

-------------------------

రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించడం ద్వారా డిస్కంలపై రుణ భారాన్ని తగ్గిస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. డిస్కంలను బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర

ఇంధన శాఖ మహారాష్ట్రలోని ముంబై వేదికగా నిర్వహించి సమావేశంలో మంత్రి నిన్న దృశ్య మాధ్యమ విధానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల చర్యల ద్వారా డిస్కంలు ఆర్థికంగా బలోపేతమవుతున్నాయని తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాలైన పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ లాంటి పథకాలను రాష్ట్రం సమర్థవంతంగా వినియోగించుకొంటోందని చెప్పారు. గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించి రైతులకు, విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ ను అందిస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో రేపటి నుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మార్చి 1వ తేదీ నుంచి 20 వ తేదీ వరకు ప్రథమ,ద్వితీయ సంవత్సరాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. అరగంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. తాగునీరు, వైద్య సేవలు, విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఆయా శాఖల అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. మాస్ కాపీయింగ్ జరగకుండా అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి తాడేపల్లిలోని ఇంటర్ బోర్డు, విజయవాడలోని డీఐఈవో కార్యాలయాలకు అనుసంధానం చేశారు.

---------------------------

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం క్రింద రైతులకు కేంద్రప్రభుత్వం ఏడాదికి 6 వేల రూపాయలు చొప్పున నగదును వారి బ్యాంకు ఖాతాలలో జమ చేస్తోంది. ఈ పథకం ద్వారా ఇటీవల పెట్టుబడి బ్యాంకులో జమ అయిందని అనంతపురం జిల్లాకు చెందిన రైతు కాటమయ్య హర్షం వ్యక్తం చేస్తూ..

వాయిస్... 24 సెకన్లు

---------------------------

"వికసిత్ భారత్ కోసం –సైన్స్, ఆవిష్కరణలలో ప్రపంచ నాయకత్వం కోసం దేశయువతను శక్తివంతం చేయడం" అనే ఇతివృత్తంతో ఈ రోజు జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహిస్తున్నారు. సర్ సి.వి.రామన్‌గా పేరు గాంచిన ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ పురస్కార గ్రహీత, భారత రత్న చంద్రశేఖర్ వెంకట రామన్ 1928 ఫిబ్రవరి 28న కాంతి కిరణాలకు సంబంధించిన "రామన్ ఎఫెక్టు"ను కనుగొన్న సందర్భాన్ని పురస్కరించుకుని ఈరోజు జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహిస్తున్నారు.

జాతీయ సైన్ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. వికసిత భారత్ లక్ష్యానికి సైన్స్ ఆవిష్కరణలను వినియోగించుకోవాలని కోరారు.

=====================